క్లుప్తంగా

యూరియా సరఫరాకు చర్యలు

రోలుగుంట: రైతులకు యూరియా సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎస్. విజయలక్ష్మి తెలిపారు. ఖరీఫ్ పురస్కరించుకొని మండలంలో గల అన్ని సచివాయాల్లోను ఎరువుల అందుబాటుల్లో ఉంచి రైతుల సాగు విస్తీర్ణం మేరకు పట్టాదారు పాస్‌పుస్తకాలాధారంగా ఎరువులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రోలుగుంట, కొమరవోలు మరికొన్ని సచివాలయాల్లో ఉన్న యూరియాను పంపణీ చేయడం జరిగిందన్నారు. నిండుగొండ, అడ్డసరం సచివాలయాల్లో ఉన్న స్టాకు మేరకు ఇస్తున్నామని, రోలుగుంట, కొమరవోలు తదితర సచివాలయాల్లో కూడా రైతుల అవసరం మేర యూరియాకు ప్రతిపాదనలు చేశామని రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

మాకవరపాలెం : రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో చిరంజీవి సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉన్న రైతులు వారు సాగు చేస్తున్న పంట వివరాలను వ్యవసాయ సిబ్బందితో నమోదు చేయించుకోవాలన్నారు. లేకుంటే పంటలు నష్టపోతే వచ్చే పరిహారం వచ్చే అవకాశం ఉండదన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక అలంకరణ



మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. మాడుగుల పట్టణానికి చెందిన భక్తులు వీధి పండగలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ఉచితంగా తాగునీరు, ప్రసాదాలు అందజేసింది.

హోటళ్లలో ఆహారపదార్థాల తనిఖీ



కె.కోటపాడులో హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు, డీటీ రమేష్

కె.కోటపాడు: హోటళ్లలో ప్రజలకు అందించే ఆహార పదార్థాల పాత్రలపై తప్పనిసరిగా మూతలు ఉండాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. కె.కోటపాడులో నిర్వహిస్తున్న హోటళ్లను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. నిల్వ వంటకాలు విక్రయించరాదని, ఎప్పటికప్పుడు హోటళ్లను శుభ్రపరుచుకోవాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆహారం తయారు చేసే వంట గదులను కూడా ఎంపీడీవో, డిటీ తనిఖీ చేశారు.

పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం



పెద్దేరు జలాశయం గేట్ల వద్ద నీరు

మాడుగుల రూరల్ : మాడుగుల మండలంలో పెద్దేరు జలాశయంలో నీటి మట్టం క్రమేపి పెరుగుతోంది. వారం రోజులుగా కురుస్తున్న తుపాను వర్షాలకు జలాశయంలో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి జలాశయంలో నీటి మట్టం 135.45 మీటర్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు ఉంది. కొండవాలు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు 334 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోందని జలాశయం జేఈ సుధాకరరెడ్డి తెలిపారు. జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీరు రాచకట్టు ద్వారా, మరో 50 క్యూసెక్కుల నీరు ఆర్ఎంసీ ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.



దేవరాపల్లి-వాలాబు రహదారిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు



జనావాసాలకు ఆనుకొని వేసిన ఖాళీ కొబ్బరి బొండాలు



చెత్త కుప్పలపై స్వైర విహారం చేస్తున్న పందులు

వ్యాధుల కాలం.. పారిశుద్ధ్యం ఘోరం

- దేవరాపల్లిలో అధ్వాన పరిస్థితులు
- రోడ్డుకు ఆనుకొని గుట్టలుగా చెత్త
- వర్షం కురవడంతో కంపుకొడుతున్న పరిసరాలు
- చెత్త కుప్పలపై పందుల విహారం
- పట్టించుకోని పంచాయతీ, ఆరోగ్యశాఖ అధికారులు



చెత్త తడిసిపోవడంతో మురుగు కూపంలా మారిన పరిస్థితి

దేవరాపల్లి : అసలే వ్యాధుల కాలం కావడంతో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. పారిశుధ్యంపై ఏమాత్రం అలసత్వం ప్రదర్శించిన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అయితే మేజర్ పంచాయితీ దేవరాపల్లిలో పారిశుధ్యం ఘోరంగా ఉంది. అధికారుల అలసత్వానికి నిదర్శనంగా రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త దర్శనమిస్తోంది.

జనావాసాలకు ఆనుకొని చెత్తాచెదారం పేరుకుపోయింది. దేవరాపల్లి నుంచి వాలాబు వెళ్లే రహదారిలో తారు రోడ్డుకు ఆనుకొని చెత్తను కుప్పలుగా వేయడంతో ఆ ప్రాంతమంతా మురుగు కూపంలా తయారైంది. జనావాసాలకు ఆనుకొని ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌కు కనుచూపు మేర చెత్తచెదారాలు గుట్టలుగా పేరుకుపోయాయి. గ్రామంలో సేకరించిన చెత్తాచెదారం అక్కడ వేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త తడిసిపోవడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి.అటుగా వెళ్లే ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆ చెత్త కుప్పలపై పందులు స్వైవిహారం చేస్తూ దుర్గంధాన్ని మరింత వ్యాపింపజేస్తున్నాయి.

గ్రామంలో తాగి పడేసిన కొబ్బరి బొండాలను సైతం వ్యాపారులు ఇక్కడే వేస్తుండడంతో దోమల వ్యాప్తికి నిలయంగా మారింది. రోడ్డుకు ఆనుకొని చెత్తకుప్పలు దర్శనమిస్తున్నా ఇటు పంచాయతీ అధికారులకు కానీ, అటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కానీ పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జనావాసాలకు మధ్య ఉన్న ఈ చెత్తకుప్పలకు ఆనుకొని ఇటు విలేజ్ హెల్త్ క్లినిక్ ఉండగా అటు దాబా, పాన్‌షాపులు ఉన్నాయి. దేవరాపల్లి ప్రజలతో పాటు శ్రీరాంపురం, శంభువానిపాలెం, వాలాబు పంచాయతీ పరిధిలోని 10 శివారు గ్రామాల గిరిజనులు, పెద గంగవరంతో పాటు అనంతగిరి మండల పరిధిలోని సుమారు 150 గ్రామాల గిరిజన ప్రజలు ఈ మురుగుకూపాన్ని దాటుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నా స్థానిక పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ఇవేమి తమకు పట్టవంటూ అధికారుల ఉదాసీనత పట్ల దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలితే తప్ప పట్టించుకోరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తా చెదారాలను జనావాసాలకు దూరంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి అక్కడికి తరలించాలని గ్రామస్తులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

బురదలో కూరుకుపోయిన గ్రానైట్ లోడు లారీ

- బుదిరెడ్లపాలెం బీఎన్ రోడ్డులో ఘటన
- నడిరోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు ఆటంకం
- మూడు పొక్లెయిన్లతో బయటకు లాగిన స్థానికులు



పొక్లెయిన్ల సహాయంతో లారీని బయటకు తీస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం,నర్సీపట్నం (బీఎన్) ప్రధాన రోడ్డులో బుదిరెడ్లపాలెం వద్ద బురద రోడ్డులో కూరుకు పోయిన గ్రానైట్ లారీని అతి కష్టం మీద మూడు పొక్లెయిన్లతో బయటకు లాగారు. మంగళవారం తెల్లవారు జామున రావికమతం నుంచి వడ్డాది వైపు గ్రానైట్ రాయి లోడుతో వస్తున్న లారీ(ట్రాలీ) బుదిరెడ్లపాలెం రామాలయం వద్ద బురదలో కూరుకుపోయింది. దీంతో నర్సీపట్నం, చోడవరం మధ్య తిరిగే పలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాలీ డ్రైవర్ బురదలో కూరుకు పోయిన లారీని బయటకు వచ్చేలా చేయాలని స్థానికులను వేడుకున్నాడు. దీంతో స్థానిక యువకులు దగ్గరలో ఉన్న పొక్లెయిన్ ఓనర్లకు ఫోన్ చేసి ఇనుప రోప్‌ల సహాయంతో లారీని బురదలో నుంచి బయటకు లాగారు. చాలా సేపు బురదలో నుంచి లారీ రాకపోవడంతో రెండు పొక్లెయిన్‌లకు ఇనుప రోప్‌లను లారీ ముందు కట్టి, మరో పొక్లెయిన్‌ను ట్రాలీ వెనక నుంచి నెట్టడంతో ఎట్టకేలకు లారీ బురదలో నుంచి బయటపడింది. దీంతో వాహనదారులకు రాకపోకలు సాగాయి. పేరుకే తారు రోడ్డు అయినా తారు మొత్తం పోయి పెద్ద పెద్ద గోతులతో బీఎన్ రోడ్డు బురదరోడ్డుగా మారిపోయింది. దీంతో ఈ దారిలో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నా అధికారులు కనీసం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోవడంపై వాహనదాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్రమశిక్షణ కొరవడితే చర్యలు తప్పవు



రోలుగుంటలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ-2 జగ్గారావు, హెచ్ఎం ప్రసాధరావు

రోలుగుంట: విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని క్రమశిక్షణ కొరవడితే చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి -2 జగ్గారావు ఆదేశించారు. మండలంలో ఆయన మంగళవారం పలు పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల ఆవరణలో పరిసరాలు, విద్యార్థుల డ్రెసింగ్ విధానం, హెయిర్ స్టైల్‌ను పరిశీలించారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నోట్‌బుక్‌లు, ఉపాధ్యాయులు సబ్జెక్టు వైజుగా ఇస్తున్న హోమ్‌వర్కులు పరిశీలించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు యూనిఫారం ధరించి పాఠశాలకు పార్థన సమయానికి వచ్చే అలవాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రార్థనలో నీతి వాక్యాలు చెప్పాలన్నారు. చదువట, రాయుట ప్రతి ఒక్కరికీ అలవాటు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి వంటకాల నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చే ఆహారం రుచిగా, శుచిగా ఉండాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చాలని, విద్యాపరంగా విద్యార్థుల్లో పోటీతత్వం ఏర్పరచి వారి ఉన్నత శిఖరాలకు బాటలు వేయాలని అన్నారు.

అక్రమంగా చేపల చెరువుల నిర్వహణ

- నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్



కొత్తపెంటలో చేపల చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: మండలంలోని అనుమతులు లేకుండా అక్రమంగా చేపల చెరువుల నిర్వహిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న చేపల చెరువులను మంగళవారం ఆయన పరిశీలించారు. చేపలకు మేతకు పశు మాంస వ్యర్థాలు, చికెన్ వ్యర్థాలు, హోటళ్లలో వ్యర్థాలను వేస్తున్నారని, దీంతో ఈ చేపలు తినడం ద్వారా ప్రజలు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చేపల చెరువుల్లోని కలుషిత నీటిని పంట పొలాల్లోకి విడిచిపెట్టడంతో పొలాల్లో పనులు చేసే రైతులు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే చేపల పెంపకందారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా అక్రమ చేపల చెరువులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

తేరుకుంటున్న పంటపొలాలు



పేట తాచేరు వంతెన వద్ద తగ్గిన వరద నీరు

బుచ్చెయ్యపేట: మండలంలో పలు గ్రామాలు ముంపు నుంచి బైట పడుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సోమవారం నుంచి వర్షం తెరిపివ్వడంతో నీటి ఉధృతి తగ్గింది. గంటికొర్లాం, పొట్టిదొరపాలెం, లూలూరు, లోపూడి విజయరామరాజుపేట, వడ్డాది, మంగళాపురం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల నుంచి పంట పొలాలు బయటపడుతున్నాయి. తాచేరు, పెద్దేరు డైవర్షన్ రోడ్లు వద్ద వరద నీరు తగ్గడంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. చెరువులు, బావుల్లో వర్షం నీరు చేరడంతో పంట పొలాలకు పుష్కలంగా సాగునీరు అందుతుందని పలు గ్రామాల రైతులు తెలియజేస్తున్నారు.

నూతన ఎస్ఐకి నేతల శుభాకాంక్షలు



ఎస్ఐ నారాయణరావును శాలువాతో సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

మాకవరపాలెం : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ దామోదర్‌నాయుడును అన్ని రాజకీయ పార్టీల నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ మేరకు ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రామకృష్ణారావు స్థానంలో వి.మాడుగులలో పనిచేస్తున్న దామోదర్‌నాయుడును నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీ ఎంపీపీ సత్యనారాయణ, తూర్పుకాపు సంఘ అధ్యక్షుడు హరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల నేతలు భద్రాచలం, బాలకృష్ణ, చిటికెల రమణ, సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీనుతోపాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. కూటమి నేతలు కూడా మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మాడుగుల రూరల్: మాడుగుల నూతన ఎస్ఐగా నియమితులైన జి.నారాయణరావును మంగళవారం సాయంత్రం స్థానిక వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు ఎం.కోడూరు ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, అదే గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు కలిసి శాలువా కప్పి సత్కరించారు.

ప్రతి గ్రామానికి హిందూ సమితి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, రామకొండలరావు తదితరులు

మాడుగుల: ప్రతి గ్రామానికి హిందూ సమితిని ఏర్పాటు చేయడం జరిగిందని, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బంకుబల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలో జంపెన శివాలయం వద్ద హిందూ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విశ్వహిందూపరిషత్ 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి హిందూపపరిరక్షణకోసం జాగృతి తీసుకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుద్దా సీతారామ్, మండల కార్యదర్శి రాపేట రామకొండలరావు, ప్రాంతాధికారి శోభారాణి, 29 పంచాయతీల నుంచి హిందూ సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : హిందూ ధర్మాన్ని కాపాడడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ అన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం వీహెచ్‌పీ గ్రామ శాఖ అధ్యక్షులు, కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. మండల వీహెచ్‌పీ అధ్యక్షులు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ 1964 సంవత్సరంలో వీహెచ్‌పీని ప్రారంభించారని, హిందూ మతం గురించి నిరంతరం కృషి చేస్తున్న వీహెచ్‌పీ మనదేశంతో పాటు పాటు ప్రపంచంలో 45 దేశాల్లో పనిచేస్తుందన్నారు. అన్యమతస్తులు మత మార్పిళ్లను ప్రోత్సహిస్తున్నారని, అటువంటి చర్యలు పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నూతన ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకారం



గొలుగొండ : గొలుగొండ బాలయోగి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.కోటేశ్వరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో పనిచేసిన ప్రిన్సిపాల్ ఆర్. రామకృష్ణ పదవీ విరమణ చేయడంతో ఈ కళాశాలలో సీనియర్ తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న కోటేశ్వర్రావుకు ప్రిన్సిపాల్‌గా జిల్లా అధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్రావుకు కళాశాల కమిటీ చైర్మన్ చిట్ల చలపతిరావుతో పాటు ఏఐఎం సభ్యులు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌సీల్లో సకాలంలో వైద్యం అందాలి



ల్యాబ్‌లో పరీక్షల వివరాలను తెలుసుకుంటున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రశేఖర్

కె.కోటపాడు: వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే పరిస్థితి ఉన్న దృష్ట్యా పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం సకాలంలో అందించేలా చర్యలను తీసుకోవాలని వైద్య సిబ్బందికి అనకాపల్లి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడ పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఆయా వయస్సులలో చిన్నారులకు అందించాల్సిందిగా తల్లి దండ్రులకు వైద్య సిబ్బంది వివరించాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ల్యాబ్‌లో పీహెచ్‌సీలో జరగాల్సిన పరీక్షలు తప్పనిసరిగా చేయాలని చంద్రశేఖర్ సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా ఎపిడమిక్ సీజన్‌లో ప్రజలు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. వైద్యాధికారి నిర్మల, గణాంక అధికారి ఎ.రామచంద్రరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యం



తాండవ గిరిజన ఆశ్రమ పాఠశాలలో భోజనం తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసనాయుడు

నాతవరం: విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ఎ.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఆయన మంగళవారం తాండవ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వసతి చాలక విద్యార్థులు పడే ఇబ్బందులు చూశారు. కిచెన్ అధ్వానంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంటును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు వేడి చేసి చల్లార్చిన మంచి నీళ్లు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం హాస్టల్‌ను తనిఖీ చేస్తున్నామన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో 189 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణకు సూచించామన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్.అశ్విన్‌కుమార్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు కూడా అందించడం జరుగుతుందన్నారు.

వైన్‌షాపుల ఉద్యోగుల ధర్నా

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు మద్యం షాపుల ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి అబిద్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామరాజు, నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 15,600 కుటుంబాలు వైన్‌షాపులపై అధారపడి జీవిస్తున్నాయన్నారు. ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా సిబ్బంది విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు.

గుల్లేపల్లిలో పారిశుధ్య చర్యలు

కె.కోటపాడు : గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి సౌజన్య అన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణ పనులు సిబ్బంది చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామంలో మంగళవారం ఆమె ఆయా పనులను పరిశీలించారు. ప్రతి వీధిలో మురుగుకాల్వల్లో పూడికలు తీయించడంతో పాటు మంచినీటి పథకాల క్లీనింగ్, క్లోరినేషన్ జరిపిస్తున్నట్టు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



చీడికాడ పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

చీడికాడ : కోల్‌కతాలో విధుల్లో వున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ దోషుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం పెదగోగాడ పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయు మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కామాక్షి మాట్లాడుతూ వేలాది మంది ప్రాణాలు కాపాడిన మహిళా వైద్యురాలికే ప్రాణ రక్షణ లేకుండా పోయిందని అన్నారు.

పశుపోషణ, సంరక్షణే ప్రధానం

చోడవరం రూరల్ : వర్షాకాలంలో పాడి, వ్యవసాయ పశువులకు అంటువ్యాధులు, గర్భకోశవ్యాధులు సోకకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.ప్రసాదరావు సూచించారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పశుపోషణ ఎంత ముఖ్యమో సంరక్షణ అంతకంటే ప్రధానమన్నారు. శిబిరం నిర్వహణలో గ్రామ సర్పంచ్ ఆది గణపతినాయుడు, ఎంపీటీసీ వెంకటేష్, మాజీ సర్పంచ్ శిరిసోళ్ల సత్యారావు, మాజీ వైస్‌ఎంపీపీ నానికుమార్ సహకరించారు. 125 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 42 పశువులకు సాధారణ చికిత్స 45 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 19 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు.